తల్లిడిల్లకుండా..!

- మాతాశిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు
- గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- ప్రతి నెలా 9న ప్రత్యేక వైద్య శిబిరాలు, నిరంతర పర్యవేక్షణ


గొల్లప్రోలు రూరల్ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పిఠాపురం: మాతాశిశు మరణాలను తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. గర్భస్థ శిశు మరణాలను నివారించడానికి పలు పథకాలను అమలు చేస్తున్నాయి. గర్భిణులకు ప్రత్యేక వసతులు కల్పించి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడంతో పాటు తల్లి కూడా ఆరోగ్యవంతంగా ఉండడానికి ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, మాతా శిశు సంరక్షణ, బాల సంజీవని, బాలామృతం, కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) గర్భిణులు, బాలింతలకు ఒక వరంగా మారాయి. వీటిపై వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి నెలా 9న ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు తల్లీబిడ్డా క్షేమంగా ఉండడానికి తగిన వైద్య సేవలు అందిస్తున్నారు.

పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి నెలా 9న ఆయా ప్రాంతాల్లోని గర్భిణులకు ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ యోజనలో భాగంగా పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారిలో ప్రమాదకర చిహ్నాలు ఉన్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్యపరమైన అవగాహన కల్పించి వారిపై మరింత శ్రద్ధ చూపుతున్నారు. వారి ఆరోగ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. క్యాలెండర్ ప్రకారం తగిన సమయంలో వైద్య సేవలు అందించడం, ప్రసవంపై తల్లుల్లో ఉన్న అపోహలు తొలగించి వారిలో ధైర్యాన్ని నింపడం, సకాలంలో ఆస్పత్రికి తరలించి కాన్పుకు సిద్ధం చేయడం వంటి పనులు ముందుగానే చేపడతారు. గర్భం దాల్చిన నాటి నుంచి వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్ల ద్వారా ఎప్పటికప్పుడు గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, తగిన సమయంలో టీకాలు వేయించడం వంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని పరీక్షలు, స్కానింగ్‌లు ప్రభుత్వమే చేయిస్తుంది.

ఇవి ప్రమాదకర చిహ్నాలు

18 ఏళ్లు నిండకుండా గర్భం దాల్చడం, 35 ఏళ్లు దాటాకా మొదటి సారి గర్భం దాల్చడం, తల్లి బలహీనంగా ఉండి తక్కువ బరువు ఉండగా గర్భం దాల్చడం, అబార్షన్ అయిన తల్లులు, మొదటి సారి ఆపరేషన్ ద్వారా ప్రసవం జరిగిన తల్లులు, కవల పిల్లలు ఉన్నట్టుగా వైద్యులు గుర్తించిన తల్లులు, 145 సెటీమీటర్ల కన్నా ఎత్తు తక్కువగా ఉన్న తల్లులు, మానసిక ఆరోగ్యం సరిగా లేని వారు, రక్తపోటు, చక్కెర వ్యాధులు ఉన్న వారు, నెగిటివ్ బ్లడ్ గ్రూపు ఉన్నవారు, 10 గ్రాముల కన్నా రక్తం తక్కువగా ఉన్న వారు, ప్రమాదకర వ్యాధులు ఉన్నవారిని డెంజర్ జోన్‌లో ఉన్నట్టు గుర్తిస్తారు.

అంతా ప్రభుత్వమే చూస్తోంది



మాది పేద కుటుంబం. గర్భం రాగానే ఎలా ఉంటుందో అన్న భయం ఏర్పడింది. కాని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి వారం నా దగ్గరకు వచ్చి తగిన సూచనలు ఇవ్వడంతో పాటు మందులు, పౌష్టికాహారం అందిస్తున్నారు. ప్రతి నెలా ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షలు చేసి దానికి తగినట్టుగా మందులు ఇస్తున్నారు.

– పోసపోయిన గంగా భవాని, గర్భిణి, తాటిపర్తి, గొల్లప్రోలు మండలం

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు



రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు మరణాలు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. మాతా శిశు సంరక్షణ పథకం ద్వారా అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు పూర్తి స్థాయిలో వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి నెలా గర్భిణులకు తగిన వైద్య సేవలు అందించడంతో పాటు పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేశారు. మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీపీ) ద్వారా గర్భిణులకు అన్ని సేవలు అందిస్తున్నాం.

– ఎస్.సుబ్బారావు, వైద్యాధికారి, గొల్లప్రోలు రూరల్ పీహెచ్‌సీ

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం


మాస్టర్ ట్రైనీల శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణను గురువారం స్థానిక ఈటీసీలో ప్రారంభించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఈఓ పీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక అయ్యారు. గ్రామాలలోని సమస్యలపై అవగాహన లేక పోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. శిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకేచోట చేరడం వల్ల సమస్యలపై చర్చించడం ద్వారా పరిష్కార మార్గం లభిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్, ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కృష్ణ మోహన్ అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన పెంచుకుని, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ఆయా జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇప్పటికే పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చామని, కార్యదర్శులకు కూడా శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పాలన సులభతరం అవుతుందని చెప్పారు. ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, కెపిఎస్‌ఆర్ నిహారికలు శిక్షణ నిర్వహించారు.

పంట నష్టం నిర్ధారణ పారదర్శకంగా ఉండాలి


చిత్రాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

పిఠాపురం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం నిర్ధారణ, అంచనాలు పారదర్శకంగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. పిఠాపురం మండలం చిత్రాడ-2 గ్రామ సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని, సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ సహాయకులతో సమీక్షించిన ఆయన పంట నష్టాల నిర్ధారణపై పలు సూచనలు చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్ బహూకరణ


గ్రంథాలయానికి ఇన్వర్టర్‌ను అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

పిఠాపురం: స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయానికి పీవీ రావు మాల మహానాడు నాయకులు గురువారం ఇన్వర్టర్‌ను బహూకరించినట్లు గ్రంథాలయ సెక్రటరీ కొండేపూడి శంకరరావు తెలిపారు. పీవీరావు మాల మహానాడు నాయకులు మారెళ్ల సోమరాజు, బత్తిన శ్యామ్యూల్ తదితరులు ఇన్వర్టర్‌ను గ్రంథాలయానికి అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు అల్లవరపు నగేష్, అడబాల హరిబాబు, పీవీ రావు మాల మహానాడు నాయకులు వేశంగి వెంకటేష్, కొంగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ

కోటనందూరు: వడగాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని కాకరాపల్లి ఇటుక బట్టీల్లో కార్మికులు, ఉపాధిహామీ పని ప్రాంతాల్లో కూలీలతో ఆయన మాట్లాడారు. తుపానుల ప్రభావంతో వచ్చే వారం రోజుల్లో భారీగా వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. పని సమయంలో వీలైనంత వరకూ తెల్లని దుస్తులు ధరించాలని, తలకు రక్షణ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 11 గంటల వరకే పని చేయాలని తిరిగి సాయంత్రం వడగాడ్పులు తగ్గిన తరువాత పని కొనసాగించాలన్నారు. వీలైనంత ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పంపన జయలక్ష్మి, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి చిటికెల సీతాదేవి పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఆవిష్కరణలు రావాలి


చిన్నారులకు సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న కృష్ణసాయి

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు విజ్ఞానదాయకంగా సాగుతున్నాయి. రామచంద్రపురం రేవతి ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణసాయి గురువారం శిబిరాన్ని సందర్శించి సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి బాల్యం నుంచే ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ఎంఎస్‌సీ మూర్తి, దుంగల పూజిత, సూర్యశ్రీ, శ్యామ్‌కుమార్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

స్థానిక శాఖా గ్రంథాలయంలో..

తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థులు పిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని తెలుగు అధ్యాపకులు ఎం.రిషి సాయికుమార్, ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. గురువారం తెలుగు పద్యాలు, కథలు, పుస్తక సమీక్షలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు


అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా వర్కర్ల పోస్టుల నియామక ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం తుని, శంఖవరం, పెద్దాపురం ప్రాజెక్టుల పరిధిలోని ఆయా పోస్టుల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా ప్రాజెక్టుల పరిధిలో 17 పోస్టులకు సంబంధించి అభ్యర్థులకు ముఖాముఖి పరీక్ష నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి, సీడీపీఓలు ఉష, పద్మావతి, ఏసీడీపీఓ నిహారిక, యూడీసీ బత్తుల మూర్తి తదితరులున్నారు.

అగ్నిప్రమాదంలో బ్యూటీపార్లర్ దగ్ధం

తొండంగి: స్థానిక మెయిన్‌రోడ్డులో గురువారం తెల్లవారుజామున సంభవించిన అగ్నిప్రమాదంలో బ్యూటీ పార్లర్ దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. బ్యూటీషియన్ టి.జ్యోతి తన బ్యూటీ పార్లర్‌ను బుధవారం రాత్రి యథావిధిగా మూసివేసి ఇంటి వెళ్లిపోయింది. తెల్లవారుజామున షాపు నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారు. వెంటనే తుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో పాటు స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే షాపులో ఫర్నీచర్, ఏసీ, కాస్మోటిక్స్ కాలి బూడిదయ్యాయి. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్టు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఈదురుగాలులతో భారీ వర్షం


కిర్లంపూడి-రాజుపాలెం ప్రధాన రహదారిపై పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: మండలవ్యాప్తంగా గురువారం ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. ఈదురుగాలులకు అరటితోటలు నేలకొరిగాయి. విద్యుత్ సరాఫరా నిలిపివేశారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులుపడ్డ ప్రజలు ఒక్కసారిగా వర్షం పడడంతో ఉపశమనం పొందారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

ప్రత్తిపాడు: గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఉదయం నుంచి వేసవి తాపంతో ప్రజలు అల్లాడిపోయారు. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు రాలేదు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. స్థానిక శిరసాల వారి వీధిలో శిరసాల నాగమణి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది. స్థానిక అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు. మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది.


ప్రత్తిపాడులో పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు

నేలకొరిగిన భారీ వృక్షం

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రాజుపాలెం నుంచి కిర్లంపూడి వచ్చే ప్రధాన రహదారిలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఆ రహదారి గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై టి.రఘునాథరావు పోలీసు సిబ్బందితో వెళ్లి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

మోడరన్ పెంటాథ్లాన్‌లో క్రీడా ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ముఖ్య అతిథులు డాక్టర్ చప్పిడి, దివాకర్ రెడ్డి తదితరులు

- సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: మోడరన్ పెంటాథ్లాన్ 6వ లేజర్ రన్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 8, 9 తేదీలలో తిరుపతి పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటపాటు కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోడరన్ పెంటాథ్లాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా క్రీడా చైర్మన్ సీహెచ్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక దృఢత్వం పెరిగి అన్ని రంగాల్లో ముందుకు వెళ్లడానికి దోహదపడతాయని తెలిపారు. కాకినాడ జిల్లా నుంచి పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. లేజర్ రన్ పోటీల్లో కాకినాడ జిల్లా బలరామపురం గ్రామానికి చెందిన పైల అనంతకుమార్ జూనియర్ విభాగంలో రెండో స్థానం, హంసవరం గ్రామానికి చెందిన దిడ్డి కృష్ణబాబు ఓపెన్ విభాగంలో 3వ స్థానం, చెక్కా శ్రీనివాస్ తాళ్లరేవు ఓపెన్ విభాగంలో 2వ స్థానం, యాత్రా రాజకుమార్ గిడజం ఓపెన్ విభాగంలో మూడో స్థానం, కాకినాడకు చెందిన దీప్తి సునయన 2వ స్థానం సాధించారు. క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు. కాకినాడ జిల్లా కోచ్ కట్ట జగన్మోహన కిశోర్, వనుం ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞంలో భాగస్వాములవుదాం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి


మహాయజ్ఞం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలనే సంకల్పంతో సీఎం జగన్ చేపట్టిన మహాయజ్ఞంలో ప్రజలందరం భాగస్వాములవుదామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం దేవదాయ శాఖాధికారులతో కలసి మహాయజ్ఞం వాల్‌పోస్టర్‌ను పెద్దాపురంలో ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకై ప్రభుత్వం యజ్ఞదీక్ష చేపట్టిందన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద జరిగే ఈ యజ్ఞంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి, మహారాణి సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: పాయకరావుపేట గవర్నమెంట్ ఐటీఐలో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ గురువారం తెలిపారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్స్‌తో ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 6వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మార్కుల లిస్టు, కుల ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, మొబైల్ నంబర్ అవసరమవుతాయని చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు. ఐటీఐలో దరఖాస్తు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని ప్రిన్సిపాల్ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం


జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2023-24 సంవత్సరానికి గాను మొదటి విడత ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ గురువారం తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్లకు సంబంధించి అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు దారులు తమ యూనిక్ ఐడీ నంబర్, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలో పరిశీలన చేయించుకుని ప్రిన్సిపల్ ఆమోదం పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 95020 89936, 93462 98918, 91009 72825 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

వచ్చే నెల 11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

తుని రూరల్: మండలంలోని హంసవరం ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో చేరేందుకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23లో ఐదో తరగతి చదువుతూ పై తరగతికి అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశపరీక్ష జూన్ 11న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు సాధించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 70329 96442 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బతుకునావకు రాజమార్గం

- కుంభాభిషేకం రేవు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం
- రూ.149 కోట్లతో అభివృద్ధి


కుంభాభిషేకం వంతెన నుంచి కాల్వలోకి బోట్లు వచ్చే ఇరుకైన మార్గం


కుంభాభిషేకం రేవు వద్ద లంగరు వేసిన బోట్లు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో పోర్టు అనుసంధానిత రహదారులు శరవేగంగా అభివృద్ధి చెంతున్నాయి. కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణంతో మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా అచ్చంపేట జంక్షన్ నుంచి కాకినాడ యాంకరేజీ పోర్టు వరకు 13 కిలో మీటర్ల పొడవున రూ.149 కోట్లతో నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్-516ఎఫ్‌గా వాకలపూడి లైట్ హౌస్ మీదుగా వెళ్లే ఈ రహదారిలో కుంభాభిషేకం రేవు వద్ద ఇరుకైన పాత వంతెన ఉంది. దీని స్థానంలో కొత్తగా వంతెనకు ప్రతిపాదించారు. ప్రస్తుతం పాత వంతెన కింద చిన్న మార్గం ఉండడంతో దుమ్ములపేటకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేట అనంతరం తమ తెప్పలు, చిన్నపాటి బోట్లను వంతెన కింద నుంచి కాల్వలోకి తీసుకువచ్చి ఒడ్డుకు చేర్చేవారు. కాకినాడ యాంకరేజ్ పోర్టుకు మెరుగైన రవాణా సదుపాయం కోసం నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారికి కుంభాభిషేకం రేవు వద్ద ఫ్లై ఓవర్ నిర్మించేందుకు బుధవారం ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు శంకుస్థాపన చేయడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. నాలుగు లైన్ల రహదారి కోసం నిర్మించే ఈ ఫ్లై ఓవర్ పెద్దగా ఉండడంతో తమ బోట్లు కాల్వలోకి తీసుకువచ్చేందుకు వీలవుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫలించనున్న చిరకాల వాంఛ

కాకినాడ దుమ్ములపేటకు చెందిన మత్స్యకారులకు సముద్రంలో చేపల వేటే జీవనాధారం. గతంలో వినియోగించే తెప్పలకు పాత వంతెన సరిపోయేది. కాలక్రమేణా వేట విస్తృతమవడంతో పెద్ద పడవలకు లంగరు వేసేందుకు ఇబ్బంది అయ్యేది. దీంతో కుంభాభిషేకం రేవు వద్దే లంగరు వేస్తున్నారు. దీంతో తుపాను సమయాల్లో, తూర్పుగాలి వీచే సమయాల్లో బోట్లు ఒకదానికి ఒకటి గుద్దుకుని దెబ్బతినేవి. దీంతో ఈ కొత్త ఫ్లై ఓవర్‌తో మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

మత్స్యకారులకు మేలు



కుంభాభిషేకం రేవు వద్ద నాలుగు లైన్ల రహదారి నిర్మించాలని గతంలో ప్రతిపక్ష నేతగా పాదయాత్రగా వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నాం. తమ విజ్ఞప్తిని గుర్తుంచుకుని నేడు సీఎంగా తమ చిరకాల కోరికకు కార్యరూపం ఇస్తున్నారు. దీని వల్ల తమ విలువైన బోట్లకు రక్షణ కలుగుతుంది.

– వాసుపల్లి కృష్ణ, మత్స్యకార సంఘ నాయకుడు, దుమ్ములపేట

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేవాలయం వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల వేంకట రామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.